

చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సిబిఐ సోదాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి)

చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. శ్రీకాళహస్తికి చెందిన రావూలూరి శ్రీనివాసులు నాయుడు చిత్రదుర్గ నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనపై నమోదైన అక్రమ ఆస్తుల కేసు విచారణను సీబీఐ చేపట్టింది. ఇందులో భాగంగా చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ మహేష్, సీఐ షైనీ రికార్డులను పరిశీలించారు. ఇదిలా వుండగా రావులూరి శ్రీనివాసులు నాయుడు పేరిట తమ కార్యాలయంలో ఎలాంటి ఆస్తులు నమోదు కాలేదని సబ్ రిజిస్టార్ కొండారెడ్డి తెలిపారు.

ఇంధన సర్దు"పోటు"వద్దు

- విద్యుత్ ఛార్జీల భారంపై నిరసనలు
- జిల్లావ్యాప్తంగా సిపిఎం ధర్నాలు

తిరుపతిలో...

నాగలాపురంలో...

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం ఇంధన సర్దుబాటు పేరిట తీవ్రమైన భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ విద్యుత్ కార్యాలయాల వద్ద జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. తిరుపతి ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం 8,114 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారం మోపుతోందన్నారు. వినియోగదారుల ప్రయోజనాలకు పరిరక్షించాల్సిన మండలి ట్రూఅప్ ఛార్జీలపై నిర్ణయం తీసుకోకుండా ఇప్పటివరకూ కాలయాపన చేయడం సరికాదన్నారు. ఇపుడు హడావిడిగా నోటిఫికేషన్ విడుదల చేసి 12 పిటీషన్లపై ఒకేసారి హడావిడిగా విచారణ చేపట్టడం తగదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా హిందుజా సంస్థకు (హెచ్‌ఎంపిసిఎల్) 1234.68 కోట్లు రూపాయలను విద్యుత్ సంస్థలు చెల్లించడం అక్రమమని అన్నారు. ఈ భారాన్ని సైతం ప్రజలపై మోపడం దారుణమన్నారు. 14 రోజుల్లో ఈ నెల 14వ తేదీ నాటికి అభ్యంతరాలు తెలపాలని, మూడు రోజుల అనంతరం ఈనెల 18న బహిరంగ విచారణ చేస్తామని మండలి ప్రకటించడం అభ్యంతరకరంగా ఉందన్నారు. ఇది ఓ రకంగా మొక్కుబడి తంతు అన్నారు. ధర్నా అనంతరం సిఎండికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, కె.వేణుగోపాల్, పి.బుజ్జి, పి.చిన్న, ఎం.నరేంద్ర, జి.చిన్నబాబు, కెఆర్ సుబ్రమణ్యం, రవి, రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

శ్రీకాళహస్తిలో... సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, నాయకులు గంథం మణి ఆధ్వర్యంలో ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఖజానాను నింపుకోవడం కోసం ట్రూఅప్ ఛార్జీల పేరిట వచ్చే భారం మోపేందుకు చీకటి జీవో తీసుకురావడం సిగ్గుచేటన్నారు. నాయకులు షరీఫ్, కుమార్, వేణు, వెలివేంద్రం, వెంకటేష్, అన్వర్ బాషా, రాజా తదితరులు పాల్గొన్నారు.

కెవిబిపురంలో... విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పైన బాదుడే బాదుడని విమర్శించిన చంద్రబాబు, నేడు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 8,114 కోట్ల రూపాయల ఇంధన సర్దుబాటు ఛార్జీలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. సామాన్యులు ప్రశ్నించలేని విధంగా ప్రతినెలా విద్యుత్ బిల్లులో 20-100 రూపాయలను దొడ్డి దారిన పెంచుతున్నారని విమర్శించారు. నాయకులు నాగలాపురం నాగరాజు, శంకరయ్య, బాలయ్య, కన్నమ్మ, లక్ష్మయ్య, రామారావు, ఎర్రప్ప పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో... విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మండల కార్యదర్శి నలుగురి రమణయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు డి. సుబ్బయ్య, తిరుపాలయ్య, ఆదయ్య, యేసుదాసు, శ్రీనివాసులు, వెంకటేష్, రమేష్, దయాకర్ పాల్గొన్నారు.



కెవిబిపురంలో..

గూడూరు టౌన్‌లో... విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి, ఇపుడు దొంగదెబ్బ తీయడం ఏంటని మండిపడ్డారు. విద్యుత్ ఎఇ ఏడుకొండలుకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు పి.శ్రీనివాసులు, బివి రమణయ్య, ఎస్.సురేష్, పామంజి మణి, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, బి.చంద్రమోహన్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

పిచ్చాటూరులో.. విద్యుత్ చార్యాలయం ఎదుట సిపిఎం మండల కార్యదర్శి జె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల విద్యుత్ ఇంజినీర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

వెంకటగిరిలో.. విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు వడ్డిపల్లి చెంగయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు సిహెచ్ రమణయ్య, నాగరాజు, రాజయ్య, ధనంజయ, పెంచలయ్య పాల్గొన్నారు.

నాగలాపురంలో.. సిపిఎం నాయకురాలు అముదా ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. నాయకులు అమృత, గౌసియా, బాలాజీ పాల్గొన్నారు.

నాయుడుపేటలో... సిపిఎం నాయకులు మహేష్ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల భారం వద్దంటూ సిపిఎం ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. నాయకులు ఎఇ అజిత్‌ఖాన్, మునీంద్రకు వినతిపత్రం అందజేశారు. నాయకులు వీరాస్వామి, మోహన్, ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

సత్యవేడులో.. విద్యుత్ ఉప కేంద్రం ఎదుట సత్యవేడు మండల కార్యదర్శి మిలుగు రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఓవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే, వరుస తుపానులతో ప్రజలు ఉపాధి లేక కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితి ఉంటే, కూటమి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో భారాలు మోపడం సరికాదన్నారు. నాయకులు కృష్ణయ్య, మురళి, సెల్వం, మునస్వామి, సుశీల, నాగమ్మ, లక్ష్మమ్మ, లక్ష్మి, శాంతి, రాణెమ్మ, గోవిందమ్మ, శాంతి పాల్గొన్నారు.

పుత్తూరులో... ఎడి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం పుత్తూరు కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఎ.విజయ్, శివ, రమేష్, నరసింహులు, మహేష్ పాల్గొన్నారు.

పుత్తూరులో...

సత్యవేడులో..

శ్రీకాళహస్తిలో..

భారాలపై 'చేపల వ్యాపారి' నాటిక ప్రదర్శన

ప్రజాశక్తి - రేణిగుంట

విద్యుత్ ఛార్జీల పెంపుకు నిరసనగా రేణిగుంట కరెంట్ ఆఫీసు వద్ద వినూత్న ప్రదర్శన జరిగింది. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో టిడిపి కూటమి బాదుడే బాదుడు, చేపల వ్యాపారి దోపిడీపై కోర్టుకెక్కిన కేసు నాటిక ప్రదర్శన జరిగింది. అనంతరం విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరినాథ్, సత్యశ్రీ, సెల్వరాజ్, వెంకటరమణ పాల్గొన్నారు. చేపల వ్యాపారి మూడు నెలల క్రితం అమ్మిన చేపలపైన అదనంగా డబ్బులు (సర్దుబాటు ఛార్జీలు) అడిగి ఇద్దరూ గొడవపడి, కొట్టుకుని ఈ కేసు కోర్టు వరకు వెళుతుంది. రాష్ట్ర ప్రభుత్వం సామాన్య, పేద మధ్యతరగతి ప్రజలపై వేస్తున్న విద్యుత్ బిల్లుల భారం ఏ విధంగా ఉందో కళ్లకు కట్టినట్లు ఈ చేపల వ్యాపారి నాటిక ప్రదర్శన ద్వారా కోర్టు జడ్జికి అర్థం అయ్యి, జడ్జిమెంట్ సామాన్య ప్రజానీకానికి అనుకూలంగా తీర్పు వస్తుంది. గతంలో వినియోగదారుడు కరెంట్ బిల్లులు ప్రతినెలా చెల్లించినప్పటికీ సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వంపైన చర్యలు తీసుకుంటామని కోర్టు జడ్జి తీర్పు కరెంట్ బిల్లులు కట్టడానికి అక్కడకు వచ్చిన ప్రజలను ఆకట్టుకుంది. బస్టాండ్ వద్దనూ ఈ నాటికను ప్రదర్శించారు. చేపల వ్యాపారిగా వెంకటరమణ, చేపలు కొన్న వ్యక్తిగా సెల్వరాజ్, జడ్జిగా రాజశేఖర్ పాత్రలు పోషించి మెప్పించారు.

రేణిగుంటలో..

కోటి తీసుకో...షాపు వదులుకో...

మద్యం షాపుల బేరసారాలు
'బార్'ల్లో తగ్గిన మద్యం ధరలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నూతన మద్యం పాలసీలో భాగంగా టెండర్లలో దుకాణాలు దక్కించుకున్న వారికి సిండికేట్లు బంపర్ ఆఫర్ ఇస్తున్నట్లు సమాచారం. షాప్ వదులుకుంటే రూ.కోటి, గుడ్ విల్ కింద ప్రతి నెలా రూ.15 వేల చొప్పున ఇస్తామని బేరం పెట్టినట్లు తెలిసింది. మరోవైపు దుకాణదారులకు నేతల నుంచి ఒత్తిళ్లు తప్పడంలేదు. కమీషన్కు ఒప్పుకుంటేనే వ్యాపారం పెట్టనిచ్చేదంటూ హెచ్చరించడంతో డైలమాలో పడ్డారు. దీంతో తొలిరోజు చాలా ప్రాంతాల్లో దుకాణాలను ప్రారంభించలేదు. ఈనెల 16 నుంచి 18 తేదీ వరకు కొన్ని షాపులు మాత్రమే మద్యం వ్యాపారులు ప్రారంభించారు. మిగిలిన షాపులు శని ఆదివారంలో ప్రారంభించనున్నారు. అయితే ఇలా ఉండగా మద్యం షాపులు దక్కించుకున్న వారికి ఒక పక్క ఆనందం ఉంటే మరోవైపు రాజకీయ ఒత్తిళ్లూ వదలకుండా ఉన్నాయి. ప్రజా ప్రతినిధుల అనుచరులకు షాపులు దక్కని వారు షాపు దక్కించుకున్న వారికి ఆఫర్లు ఇస్తున్నారు. దీనికి తోడు మద్యం షాపులు పెట్టుకోవడానికి తిరుపతి వంటి నగరంలో అద్దెలు అధికంగానే ఉన్నాయి

తిరుపతి జిల్లాలో 227ప్రైవేట్ మద్యం దుకాణాలకు లాటరీ ద్వారా కేటాయింపులు జరిగాయి. వీరంతా దుకాణాలు ఏర్పాటు చేసుకునే పనిలో పడ్డారు. అయితే వ్యక్తిగతంగా షాపులు దక్కించుకున్న వారు మాత్రం నిర్వహణ కోసం దాదాపు రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. అంత స్థోమత లేని వారంతా ఇతరులకు ఇచ్చే యోచనలో పడ్డారు. టెండర్ విధానంలో షాపులు రాని వారు, షాపులు దక్కించుకున్న వారంతా సిండికేట్ గా ఏర్పడి వ్యక్తిగత దుకాణాదారుల నుంచి షాపులు ఇప్పించుకునే పనిలో పడ్డారు.

మరోవైపు బెదిరింపుల పర్వం ఆగడంలేదు. మొదట 50- 50తో ఒప్పందం చేసుకుని చాలా మంది టెండర్లు వేశారు. మరి కొంతమంది ఆన్ లైన్ ద్వారా సమర్పించారు. వీరికే ఎక్కువ శాతం దుకాణాలు దక్కాయి. వీరిలో ఎలాంటి పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్, రాజకీయ పలుకుడి లేని వారిని టార్గెట్ చేసుకుని ఎమ్మెల్యేలు ఒత్తిళ్లకు గురి చేస్తున్నారనే వార్తలు జోరందుకున్నాయి. కమీషన్ ఇవ్వకుంటే దుకాణాలు పెట్టనివ్వమంటూ తేల్చి చెబుతున్నారు. మరి కొందరు నేతలు దుకాణాదారులను ఇళ్లకు పిలుపించుకుని మీటింగులు పెట్టి మరీ కోటింగులిస్తూ తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అందుకే బుధవారం దుకాణాలు ప్రారంభించాల్సి ఉన్నా చాలా చోట్లా తెరుచుకోలేదని తెలుస్తోంది. రెండు, మూడ్రోజుల్లో ఈ సమస్య కొలిక్కి రానున్నట్లు సమాచారం. ఇక, ఒకే పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల అనుచరులు షాపులు దక్కించుకోవడంతో స్థానిక ఎమ్మెల్యేలకు పెద్ద సమస్యగా మారింది. కమీషన్ లేదా వాటా ఇవ్వాలని ఎమ్మెల్యేలు పట్టుబడుతుండగా అందుకు వారు ససేమిరా అంటున్నట్లు సమాచారం. వీరి మధ్య ఎలాంటి సయోధ్య కుదురుతుందోనని చర్చలు జోరందుకున్నాయి.

జాతీయ సఫాయి కర్మచారి ఛైర్మన్‌కు సాదర స్వాగతం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జాతీయ సఫాయి కర్మచారి ఛైర్మన్ ఎం.వెంకటేశన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి స్వాగతం పలికారు. ఎం.వెంకటేశన్ ఈ నెల అక్టోబర్ 18 నుండి 20 వరకు తిరుపతి, చిత్తూరు జిల్లాలో 'ది ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ యాజ్ మాన్యువల్ స్కావెంజర్ అండ్ రీహాబిలిటేషన్ యాక్ట్, 2013' అమలును సమీక్షించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం కు విచ్చేసిన అనంతరం చిత్తూరు జిల్లాకు రోడ్డు మార్గాన చేరుకుని పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. తిరిగి రాత్రి 8 గంటలకు తిరుపతికి విచ్చేసి రాత్రి బస చేశారు. 19 వ తేది ఉదయం తిరుమల శ్రీవారిని విఐపి బ్రేక్ దర్శనం చేసుకుని మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్, సెక్రటరీతో పాటు సంబంధిత సఫాయి కర్మచారి నాయకులు, పారిశుధ్య కార్మికులతో తుడా కార్యాలయంలో సమావేశం అవుతారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు డీన్, మెడికల్ సూపరింటెండెంట్, శ్రీ వెంకటేశ్వర రాంనారాయణ్ రుయా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ - ఇతర సీనియర్ అధికారులతో పాటు సఫాయి కర్మచారి నాయకులు, పారిశుధ్య కార్మికులతో సమావేశం అవుతారు. సాయంత్రం 5 గంటలకు శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్ డైరెక్టర్-కమ్-వైస్ ఛాన్సలర్, మెడికల్ సూపరింటెండెంట్, ఇతర సీనియర్ అధికారులతో స్విమ్స్ మీటింగ్ హాల్ నందు సమావేశం అవుతారు. 20వ తేదీన ఉదయం 9.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి ఢిల్లీ కి తిరుగు ప్రయాణం కానున్నారు.

ఆర్టీసీలో ఖాళీలను పూరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆర్టీసీలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘం అనుబంధమైన ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ ఆర్టీసీ శాఖ సిబ్బంది, బస్సుల లోటుతో నడుస్తోందన్నారు. ప్రభుత్వంలో విలీనం చేసినా ప్రయోజనం శూన్యమన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆర్టీసీ ఉద్యోగులకు న్యాయం చేకూరుతోందంటే అదీ మిథ్యేనన్నారు. ఆర్టీసీలో ప్రమోషన్లు ఆగిపోయాయన్నారు.

ఉద్యోగులకనుకూలమైన సర్క్యులర్లు అమలు కావడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్ట సుబ్రమణ్యం, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్కే జిలాని బాషా, జీ. బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి శివ కుమార్, మల్లికార్జున, సుధాకర్, రత్నం, ఎంబికే రెడ్డి, ఎంఎస్ మణ్యం పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై కౌన్సిలర్ దాడి

ప్రజాశక్తి... వెంకటగిరి

తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ నేలపాటి సాయికుమార్‌పై అవార్డు కౌన్సిలర్ దాడి చేశారని రాష్ట్ర ఉద్యోగుల సంఘం వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షులు చింతగుంట కష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు నీటి సమస్యపై ఇంజనీరింగ్ అసిస్టెంట్ తో చరవాణిలో మాట్లాడిన కౌన్సిలర్ ఉగ్రరూపంతో అతనిపై దాడికి పాల్పడడం బాధాకరమని ఉద్యోగుల సంఘం ట్రెజరర్ గంజి అశోక్ కుమార్ పేర్కొన్నారు. కేవలం నీటి సమస్య పరిష్కరించడానికి కమిషనర్ లేనందున ఉన్నత అధికారులు దష్టికి తీసుకు వెళ్తానని చెప్పిన ఉద్యోగానికి లోనై వికలాంగుడినైన తనపై దాడి చేసి గాయపరిచారని బాధితుడు వాపోయారు ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగులపై జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పిడుగు పడి ఇద్దరు కూలీలు మృతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

పిడుగు పడి ఇద్దరు కూలీలు మృతిచెందిన ఘటన తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం హనుమంతపురం గ్రామంలో చోటు చేసుకుంది. హనుమంతపురం గ్రామానికి చెందిన దామోదరం పొలంలో శుక్రవారం ఉదయం కూలి పనికి మణి (54), రాము (50) వెళ్లారు. అయితే మధ్యాహ్నం భారీ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడుకుని పిడుగులు పడ్డాయి. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో ఆ రెండు కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి వీధినపడ్డాయి. పిల్లలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని కుటుంబ సభ్యులు వేదన అందరినీ కంట తడిపెట్టిస్తోంది. రోజువారి పనికి పోతే గాని తమ కుటుంబాలు గడవవని, అటువంటిది సంపాదించే ఇంటిపెద్ద చనిపోతే తమ పరిస్థితి ఏంటని వారు వాపోతున్నారు. మణికి ముగ్గురు కుమార్తెలు, భార్యా ఉన్నారు. రాముకు కుమార్తె, భార్య ఉన్నారు. వీరి మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

'దిశ' కమిటీ సమావేశాలు నిర్వహించండి : ఎంపి

తిరుపతి టౌన్ : రాష్ట్ర, జిల్లాస్థాయి దిశా కమిటీ సమావేశాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్రటరీ శైలేష్‌కుమార్ సింగ్‌ను కోరారు. ఆమోదించబడిన ప్రాజెక్టులను సకాలంలో అమలు చేయడం తోపాటుగా చర్చల సమయంలో లేవనెత్తిన సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంలో ఈ సమావేశాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని అన్నారు.

విధి నిర్వహణలో...
అటవీ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రమాద స్థలిని పోలీసులకు చూపించబోయి, రోడ్డు ప్రమాదంలో ఒప్పంద అటవీ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన గురువారం అర్ధరాత్రి తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామ సమీపంలో నాయుడుపేట-మదనపల్లి జాతీయ రోడ్డుపై చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే.. తొట్టంబేడు మండలం బసవయ్యపాలెం ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేష్(35) గత 15 ఏళ్లుగా బసవయ్యపాలెం చెక్ పోస్టు వద్ద ఒప్పంద ఫారెస్ట్ వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి పెద్దకన్నలి సమీపంలో కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్, కేరళ నుంచి వెళ్తున్న టూరిస్ట్ బస్సు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలికి వెళ్లేందుకు చెక్ పోస్టు విధుల్లో ఉన్న అటవీ ఉద్యోగి వెంకటేష్ సాయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఘటనా స్థలికి వెళ్ళాక పోలీసులు దర్యాప్తు చేస్తున్న సమయంలో పోలీసు వాహనాన్ని వెనుకవైపు నుంచి గ్యాస్ లారీ వేగంగా ఢీ కొంది. దీంతో పోలీసు వాహనం కట్టెల లోడ్డుతో ఉన్న ట్రాక్టర్ ను బలంగా ఢీ కొట్టడంతో అందులో ఉన్న అటవీ ఉద్యోగి వెంకటేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మతుడు వెంకటేష్ కు భార్య, ఇద్దరు చిన్నపిల్లలున్నారు. ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు వాహనాన్ని ఢీకొన్న గ్యాస్ లారీ

ఈ ప్రమాదాన్ని చూపించేందుకు వచ్చే..

కానరాని అభివృద్ధి..

- ఐదేళ్లుగా మారని వేణుంబాకం రోడ్డు దుస్థితి
- రాకపోకలకు ఇబ్బంది
- '108' వాహన సేవలూ కరువు
- పట్టించుకోని ప్రభుత్వాలు..

ప్రజాశక్తి -దొరవారిసత్రం : తాము అధికారంలోకి వస్తే గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో చెప్పే పార్టీలు అధికారంలోకొచ్చిన తర్వాత అభివృద్ధి విషయాన్ని విస్మరిస్తున్నాయి. గతంలో ప్రతిపక్షంలో వున్న టిడిపి నాయకులు 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' అంటూ రహదారుల దుస్థితిపై పోరాటం చేశారు. అయితే ప్రస్తుతం అదే పార్టీ నాయకులు అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఈ కారణంగా తమ గ్రామంలోకి 108 వాహనం కూడా రావడం లేదని, సుమారు ఐదు కిలోమీటర్లు మేర వున్న ఈ రోడ్డు అడుగడుగునా గుంతల మయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందని దొరవారిసత్రం వేణుబాకం గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఐదేళ్లుగా మారని దుస్థితి

డివిసత్రం మండలంలోని వేణుంబాకం రోడ్డు ఐదు కిలోమీటర్లు మేర అడుగడుగునా గుంతలమయమైంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ గ్రామం ఏ మాత్రం అభివృద్ధి చెందడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఈ గ్రామంలో సుమారు ఐదు వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆ గ్రామానికి రాకపోకలు సాగించాలంటే జాతీయ రహదారిపై నుంచి ఆర్అండ్బి శాఖ ఐదు కిలోమీటర్ల దూరం తారు రోడ్డు ఏర్పాటు చేసింది. అయితే ఈ రోడ్డు మూడు సంవత్సరాల క్రితం మరమ్మతులకు గురై ఐదు కిలోమీటర్ల దూరం గుంతలతో దర్శనమిస్తోంది. ఈ రోడ్డు మీదుగానే పాలెంపాడు, వేణుంబాక గ్రామస్తులు రాకపోకలు సాగించాల్సి వుంది. ప్రస్తుతం ఎలాంటి మరమ్మతుకు నోచుకోకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని వారు వాపోతున్నారు.

'108' వాహన సేవలూ కరువు

ఆటోలు, ద్విచక్ర వాహనాలు రావాలంటే గంటల తరబడి ప్రయాణించాల్సి వస్తోంది. గ్రామంలో ఎవరికైనా ఆరోగ్యం సరిలేక అత్యవసర సమయంలో రావాలంటే సమయానికి వైద్యం అందించలేక మృతి చెందిన సంఘటన లూ ఎన్నో ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అత్యవసర సమయంలో 108 వాహనాలు కూడా తమ గ్రామానికి రావడం లేదని, ఈ కారణంగా మెయిన్ రోడ్డుకు రావాలంటే వాహనాలు మరమ్మతుకు అవుతున్నాయని సాకులు చెబుతూ తప్పించు కుంటున్నారన్నారు. ఆస్పత్రికి, అత్యవసరంగా ఎక్కడికైనా వెళ్లాలన్నా నరక యాతన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రోడ్డును బాగు చేయాలని వేడుకున్నా వారు ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే తప్ప శాశ్వతమైన మరమ్మతులు చేయడం లేదని, వర్షాకాలం అయితే రోడ్డుపై ఏర్పడిన గుంతలలో వర్షపు నీరు చేరడంతో ఆటో ద్విచక్ర వాహన దారులకు గుంతలు కనబడక ప్రమాదాలకు, వాహనాలు మరమ్మతులు గురికావడం వంటివి జరుగుతున్నాయన్నారు.

పట్టించుకోని ప్రభుత్వాలు

ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి..' అంటూ కార్యక్రమం నిర్వహించి వేణుంబాకం రోడ్డు గుంతలను ఫొటోలు తీసి రాష్ట్ర స్థాయి నాయకు లు వరకు పంపిందని, ప్రస్తుతం టిడిపి అధికారంలోకి వచ్చి సుమారు ఐదు నెలలు గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని వాపోతున్నారు. ఈ ప్రభుత్వంలో అయినా తమ రోడ్డుకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని వేణుంబాకం, పాలెంపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతలమయమైన వేణుబాకం రోడ్డు

క్రైం న్యూస్

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చంద్రగిరి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పాకాల రైల్వే పోలీసుల కథనం మేరకు..చంద్రగిరి మండలం పాకాల వారి పల్లికి చెందిన పాపారెడ్డి కుమార్ (45) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం సాయంకాలం 4 గంటల సమయంలో పాకాల వారి పల్లి-పనపాకం మధ్య 73/17-13 స్తంభాల మధ్య వేగంగా వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహంపై రైలు దూసుకువెళ్లడంతో ఛిద్రమైంది. స్థానికులు అందించిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'రుయాస్పత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : రుయా ఆస్పత్రిలో మెరుగైన పలు సౌకర్యాలు ఏర్పాటుకు కమిటీ ఆమోదిస్తూ పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు బాధ్యతగా అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సంయుక్తంగా సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్వీ వైద్య కళాశాల పాలన భవన కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ చైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కో చైర్మన్ హోదాలో, బి లక్ష్మీపతి సభ్యులుగా సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షలో పాల్గొని రుయా ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వైద్యులు వారి సిబ్బంది, ఇంజనీర్లు, ఇతర అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అప్పుడే ఆసుపత్రి పేద రోగులకు అందుబాటులో వుంటుందని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ మీటింగ్ గత ఒకటిన్నర సంవత్సరం నిర్వహించలేదని అధికారులు తెలుపగా తాను కలెక్టర్ గా ఉన్న నాటి నుండి ఇది రెండో సమావేశం అని, ఇక నుండి క్రమం తప్పకుండా సమావేశం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎస్ వి ఆర్ ఆర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో ఎన్ మౌర్య, తిరుపతి మునిసిపల్ కమిషనర్, బి లక్ష్మీపతి, హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు డాక్టర్ చంద్రశేఖరన్, ఎస్వి మెడికల్ కళాశాల పిన్సిపాల్, ఎం శివరామి రెడ్డి, ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డాక్టర్ యు శ్రీహరి, తిరుపతి జిల్లా ఆరోగ్య వైద్యాధికారి, డాక్టర్ ఎస్. ఆనంద మూర్తి, జిల్లా డిసిహెచ్ఎస్, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి రవి ప్రభు పాల్గొన్నారు.

రేపు అఖిల గాండ్ల తెలికుల వివాహ పరిచయ వేదిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తిరుచానూరులోని పద్మావతి కన్వెన్షన్ సెంటర్లో అఖిల గాండ్ల తెలికుల వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహకులు బండారు శ్రీనివాసులు, సాకం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో వారు మాట్లాడుతూ గతంలో క్రమంగా వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించే వారమన్నారు. కరోనా తరువాత మళ్లీ తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అఖిల గాండ్ల తెలికుల కులస్తులకు ఉపయుక్తంగా వివాహ పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరిచయ వేదికకు వచ్చే వారు రిజిస్ట్రేషన్ రుసుం రూ.500 చెల్లించాలన్నారు. బయోడేటాతో పాటుగా రెండు పాస్పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గుణశేఖర్ పాల్గొన్నారు.

20న జూడో జట్టు ఎంపిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 20, 21వ తేదీలలో రాష్ట్రస్థాయి జూడో అండర్-17 జట్టును ఎన్నుకుంటారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 జిల్లాల నుంచి 130 మంది బాలురు, 130 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఇక్కడ ఎన్నికైన క్రీడాకారులు జమ్మూ, అస్సాం రాష్ట్రాల్లో జరిగే జాతీయస్థాయిలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పురాణ ఇతిహాస విభాగం ద్వారా ఆదికవి వాల్మీకి జయంతిని విశ్వవిద్యాలయంలోని వాల్మీకి మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ విసి ప్రొఫెసర్ జియస్ఆర్ కృష్ణమూర్తి, అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, వేదభాష్య విభాగాధ్యక్షులు డాక్టరు నిరంజన్ మిశ్రా, సాహిత్య ఆచార్యులు డాక్టరు బలిచక్రవర్తి పాల్గొన్నారు.

'ఎస్వియూ క్రీడా మైదానం ప్రైవేటు వాణిజ్య కార్యక్రమాలకు నిలయమా?'

ప్రజాశక్తి - క్యాంపస్ : 'శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ క్రీడా మైదానం ప్రైవేట్ వాణిజ్య కార్యక్రమాలకు నిలయమా ?' అని ఎస్వీయూ ఇన్ఛార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావును వైఎస్ఆర్ విద్యార్థి సంఘం నేతలు ప్రశ్నించారు. ఎస్వీయూ విసికి ఆ సంఘం నేతలు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి జంగంరెడ్డి కిషోర్ దాస్ మాట్లాడుతూ ఈనెల 26 తేదీన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం క్రీడా మైదానాన్ని ప్రైవేటు వాణిజ్య కార్యక్రమానికి యూనివర్సిటీ అనుమతి ఇవ్వడంపై తీవ్రమైన అభ్యంతరం వెలిబుచ్చారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఎస్వియుకి ఎంతో ఘన చరిత్ర కలిగి ఉందని, 50 సంవత్సరాలుగా యూనివర్సిటీ మైదానంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని, కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, మరికొన్ని ప్రవేట్ కార్యక్రమాలు నిర్వహించారని కానీ ఏ రోజూ మైదానంలోకి ఎంట్రీ ఫీజు నిర్ణయించి వసూలు చేసిన దాఖలాలు లేవన్నారు. బుక్ మై షో యాప్ ద్వారా యూనివర్సిటీ మైదానంలో ఎంట్రీ టికెట్ రూ.8వేలు నుంచి 2 వేల రూపాయిలు వరకు ఒక్కొక్కరి దగ్గర వసూలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం యూనివర్సిటీ ఉన్నత అధికారులు భారీ ఎత్తున అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై హైకోర్టు విశ్రాంత జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాలని లేకుంటే పెద్ద ఎత్తున అఖిలపక్ష విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ముని కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేష్, చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల పవన్ కుమార్ యాదవ్, రావూరి హరికృష్ణ, జగదీష్ యాదవ్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి..

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండలంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల వల్ల నీట మునిగిన గిరిజన కాలనీ వాసులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జనమల గురవయ్య శుక్రవారం శ్రీకాళహస్తి మండల తహశీల్దారు లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ముల్లపూడి గిరిజన కాలనీ, వేడం గిరిజన కాలనీ, చుక్కలు నిడిగల్లు గిరిజన కాలనీ, పట్టణంలోని ఈశ్వరయ్య కాలనీ, చెంచులక్ష్మి కాలనీలలో వర్షపు నీరు వచ్చి చేరిందన్నారు. ఈ ప్రాంతాల్లో నివసించే వారంతా రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలని వర్షాల కారణంగా కూలీ పనులు కూడా దొరకడం లేదని ఇలాంటి వారికి ప్రభుత్వం వెంటనే నిత్యావసర సరుకులు అందించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మించిల శివకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని లక్ష్మీపురం పాఠశాలలను ఎంఇవో ముని సుబ్రహ్మణ్యం శుక్రవారం తనిఖీ చేశారు. మొదట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినివిద్యార్థుల చదువును, వారి కనీస వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నెలవాయి జడ్పి హైస్కూలులో మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యటించి విద్యార్థులు చదువు ఏ స్థాయిలో వుందో విద్యార్థిని విద్యార్థులు ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. వారి రోజువారి హోంవర్కును పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రోజువారి హోంవర్క్ ఇచ్చి ఉదయం పాఠశాలకు వచ్చేటప్పుడు కచ్చితంగా పూర్తి చేసుకు రావాలని సూచించారు. దానికి తల్లిదండ్రులే బాధ్యత వహించాలన్నారు. పాఠశాల వెలుపల ప్రవర్తన్నడు తల్లిదండ్రులే పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం బిఎన్కండ్రిగ హైస్కూలు లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం

వైసిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం పత్తిపుత్తూరుకు చెందిన వైసిపి మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యం రెడ్డిని మాజీ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న సుబ్రహ్మణ్యం రెడ్డిని ఆయన స్వగృహంలో పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వడమాలపేట మండల వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వడమాలపేట మండలం పత్తి పుత్తూరు హరిజనవాడకు చెందిన వైసిపి రాష్ట్ర మాజీ ఎస్సి సెల్ కార్యదర్శి కృష్ణమ్మ ఆనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం మాజీ మంత్రి ఆర్కే రోజా కృష్ణయ్య కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట మాజీ జెడ్పిటిసి సురేష్ రాజు, నందయ్య, ప్రజాప్రతినిధులు, నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

'దోమకాటు, కలుషిత నీటితో జాగ్రత్తగా వుండాలి'

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: అధిక వర్షాల కారణంగా గ్రామాల్లో దోమలు అధికంగా అభివృద్ధి చెందడంతో పాటు తాగునీరు కలుషితంపై జాగ్రత్తగా వుండాలని భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హేమంత్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వలసల వారిపల్లెలో కుష్టు, డెంగీ, మలేరియా వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు చర్యలు, నీటి కాలుష్యం తదితర విషయాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటి డెమో కిరణ్ కుమార్ ఆరోగ్య విద్యను బోధించారు. పరిసరాలలో నీరు నిలువ ఉంటే దోమలు అభివృద్ధి చెందుతాయని, దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై టైఫాయిడ్, కామెర్లు, డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం వుందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఓ, అమర నాథరెడ్డి, సూపర్ వైజర్ సుబ్రహ్మణ్యం, ఆశా కార్యకర్త లక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సలహాలు, సూచనలు అందిస్తున్న వైద్యాధికారులు

నేటి నుండి పల్లె పండుగ వారోత్సవాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో నేటి నుంచి మొదటి విడత పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల నిర్వహణకు 12 పంచాయతీలు ఎంపిక కాగా మొదటి విడతగా బసవయ్య పాలెం, పెద్ద కన్నలి, చిన్న సింగమాల, పొయ్య, కొత్త కండ్రిగ, బోనుపల్లి చిట్టత్తూరు, పెద్దకనపర్తి పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికకు రోడ్లు, సిసి రోడ్లు, మినీ గోకులం షెడ్స్, పండ్ల తోటల అభివృద్ధి, పంట కాలువలు పునరుద్ధరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేయనున్నట్లు వివరించారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం: సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం- 1994 గూడూరు డివిజన్లో పటిష్టంగా అమలు అయ్యేందుకు అందరూ సహకరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ సబ్ డివిజనల్ మల్టీ మెంబర్ అప్రాప్రీయేట్ అథారిటీ కమిటీ సమావేశం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 అమలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిటీ సభ్యులకు వివరించారు. ఎక్కడైనా చట్టం ఉల్లంఘన కనిపిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిటీ సభ్యులు ఈ చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్హెచ్వో పద్మావతి, బాబు , నెహ్రూ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

నేడు మహతిలో 'అబ్దుల్ కలాం పురస్కారాలు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా తిరుపతి నగర పరిధిలోని మహతి కళాక్షేత్రంలో కలాం పురస్కారాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బాష సిరివెల్ల తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి బెంగుళూరు ఇస్రో కేంద్రం ఓఎస్డి కెవి లక్ష్మణకుమార్, ఇస్రో సైంటిస్ట్ భవాని కుమార్, అంతర్జాతీయ డెయిరీ సైంటిస్ట్ కరుణానిధి, పలువురు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. ఈ సందర్భంగా పిల్లల్లో సైన్స్ అండ్ టెక్నాలజీపై మరింత అవగాహన పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ను ఏర్పాటు చేశామన్నారు. సైన్స్ పరిశోధనల వల్ల కలిగే మేలును విద్యార్థులకు వివరించడానికి నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ప్రత్యేక ప్రతిభావంతులతో కలాం ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. కలాం ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హేమంత్, కార్తీక్ పాల్గొన్నారు.

జాతీయ ఇన్స్పైర్ పోటీల్లో కల్లూరు విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : జాతీయ స్థాయి ఇన్స్పైర్ పోటీల్లో దొరవారిసత్రం మండల పరిధిలోని కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వాంకిలి నిరోష ఉత్తమ ప్రతిభ చూపింది. పదవ తరగతి చదువుతున్న ఆ విద్యార్థిని జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకుంది. ఆ విద్యార్థిని గ్రామీణ ప్రాంతమైన కల్లూరు హైస్కూల్లో ప్రాథమిక విద్యను కొనసాగించింది. 2023 - 2024 సంవత్సరానికి 'ఇన్స్పైర్ - మనక్' ద్వారా ఢిల్లీ ప్రగతి మైదానంలో నిర్వహించిన జాతీయ ఎగ్జిబిషన్ ప్రాజెక్టు కమిటీలో ఆంధ్ర రాష్ట్రం నుండి ఈ విద్యార్థిని తయారుచేసిన 'ట్రాలీ ఫర్ సీవేజ్ క్లీనింగ్ 'పరికరం జాతీయ స్థాయిలో ఎంఎకైంది. మొదట ఈ విద్యార్థిని తయారుచేసిన పరికరం జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి నుండి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులలో ఆంధ్ర నుండి దొరవారి సత్రం మండల విద్యార్థిని ఎంపిక కావడం ఎంతో గర్వకారణం. ఈ సందర్భంగా శుక్రవారం ఎంఈఓ కృష్ణయ్య, హెచ్ఎం రమణయ్య లు విద్యార్థిని ని అభినం దించి, ప్రశంసించారు. ఈ ఉపకరణం ప్రధానంగా పారిశుద్ధ్య నివారణకు ఎంతో ఉపయోగం ఉందని, మరెన్నో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని నిరోషా మేధాశక్తిని కొనియాడారు. పాఠశాలలో బోధన సిబ్బంది, విద్యార్థినికి అందించిన ప్రోత్సాహకాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ ఇన్స్పైర్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థిని

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- ఓజిలి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధ్యక్షురాలు గడ్డం అరుణారెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో సిహెచ్ విజయలక్ష్మి , తహశీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వ హించారు. వివిధ శాఖల అధికారులు ఈ మూడు నెలల కాలంలో వారి వారి శాఖల అభివృద్ధిని వివరించారు. అనంతరం నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో విజయలక్ష్మిని ఎంపిటీసీలు, సర్పంచులు ప్రజాప్రతినిధులు, మండల వివిధ శాఖల ఉద్యోగులు పరిచయం చేసుకున్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓజిలిలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

కోట : కోట మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాల్లో ఎంపిడివో వై వేణు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాఫీగా నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక తహశీల్దారు కటారి జయజయ రావు, జెడ్పిటిసి దాసరి కోటయ్య, ఎంపిపి దాసరి అంజమ్మ, వైఎస్ ఎంపిపి ఉప్పల శేషయ్య గౌడ్ లు హాజరయ్యారు. పలువురు నాయకులు గత సమావేశంలో తెలిపిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయని అధికారులను నిలదీశారు. గత సమావేశంలో సమస్యలను ఏవో అధికారులను అడిగి తెలుసుకుని ఎన్ని పరిష్కారమయ్యాయి? తర్వాత తెలుపుతామని ఎంపీడీవో పేర్కొన్నారు. తహశీల్దారు కటారి జయజయరావు మాట్లాడుతూ మండల పరిధిలో అన్నీ పంచాయతీల్లో ఎలాంటి వివాదాస్పదాలు లేకుండా అన్ని రకాల అభివృద్ధికి తోడ్పాటును అందించేలా ఉండాలని సమావేశంలో తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరికి పలు విషయాలపై సలహాలు, సూచనలు అందించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ఈ మూడు నెలల కాలంలో వారి వారి శాఖల అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో కోట ఎంపిటిసిలు షేక్ మొబీన్ బాష, షంషుద్దీన్, సురేష్, మాజీ జెడ్పిటిసి, కొత్తపట్నం ఉప సర్పంచ్ ఉప్పల ప్రసాద్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచు లు, పంచాయతీ సెక్రటరీలు, విఆర్వో లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోట ఎంపీడీవో వై వేణు

ప్రత్యేక చికిత్సతో క్షయ నివారణ
- డాక్టర్ దివాకర్

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రత్యేక చికిత్సతో క్షయను నివారించవచ్చునని మండల వైద్యాధికారి డాక్టర్ దివాకర్ పేర్కొన్నారు. బిఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో క్షయ నివారణ పై ఎంఎల్ హెచ్పలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. సచివాలయ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులలో ఎవరికైనా రెండు వారాలకు మించి జ్వరం, దగ్గు, దగ్గినప్పుడు తెమడ పడటం, తెమడతో పాటు రక్తం పడడం బరువు తగ్గడం, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ఖచ్చితంగా టీబీ నిర్ధారణ పరీక్షకు పిహెచ్సికి పంపాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా ఆరు నెలల పాటు చికిత్స ఇస్తారని తెలిపారు. ఆశ కార్యకర్తల ప్రత్యక్ష పర్యవేక్షణ చికిత్స ఇస్తారన్నారు. ఈ ఆరు నెలల కాలంలో వారికి పౌష్టికాహారం కోసం ప్రభుత్వం నుండి నెలకు రూ. 500 చొప్పున వారి బ్యాంకు అకౌంట్లో జమ చేస్తారని, చికిత్స కాలంలో మొదటి రెండు నెలల తరువాత కళ్లె పరీక్ష చేయించుకోవాలని, మళ్లీ చికిత్స పూర్తయిన తర్వాత మరోసారి కళ్లే పరీక్ష చేసుకుని నిర్ధారించుకో వాలన్నారు. వ్యాధిగ్రస్తుని ఇంట్లో ఎవరైనా అనుమానితులు ఉంటే వారికి కూడా కళ్లే పరీక్ష చేయాలని ప్రత్యక్ష పర్యవేక్షణ, చికిత్స పద్ధతి ద్వారా ఈ టీబీని నిర్మూలించవచ్చని తెలిపారు. వ్యాధిగ్రస్తుడు తుమ్మడం, దగ్గడం, మాట్లాడడం ద్వారా వచ్చే తుంపర్ల ద్వారా ఈ వ్యాధి ఒకరి నుండి ఒకరికి వ్యాప్తి చెందుతుందని, వ్యాధి గ్రస్తులు తప్పనిసరిగా మాస్కు ధరించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎక్కడబడితే అక్కడ ఉమ్మి వేయకూడదని, ప్రజలలో వీటిపై అవగాహన సదస్సు లు ఏర్పాటు చేసి క్షయ గురించి తెలిపి చికిత్స గురించి తెలిపితే ఈ వ్యాధిని సమూలంగా రూపుమాపవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరువైజరు జ్యోతి, ఫార్మసిస్ట్ స్వాతి, ల్యాబ్ టెక్నీషియన్ అనూష పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహక కల్పిస్తున్న వైద్యాధికారి

కాలువకు హద్దులు ఏర్పాటు చేయండి: టిడిపి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ చెరువు నుంచి ఇతర చెరువులకున్న సప్లై చానళ్లను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని పాత కాల్వ టిడిపి నాయకులు శివకుమార్ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ తహశీల్దారు రామాంజులు నాయక్ కు శుక్రవారం వినతి సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ సి.మల్లవరం పంచాయతీ లోని సప్లై చానల్ ద్వారా పాతకాల్వ, సి గొల్లపల్లి, రామానుజ పల్లి, తుమ్మలగుంట గ్రామాలకు గొలుసుకట్టు సప్లై చానళ్లు ఉన్నాయని తెలిపారు. గతంలో సి మల్లవరం వద్ద ఉన్న సప్లై చానల్ నుంచి పలు చెరువు లకు నీళ్లు చేరేవన్నారు. ప్రస్తుతం ఈ కాలువలు కబ్జాకు గురయ్యాయని, వీటిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాలు వస్తే చెరువుల్లోకి ఈ చానళ్ల ద్వారా నీళ్లు చేరితే రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు తాగు నీటి కి ఇబ్బంది ఉండదన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే పులివర్తి నానికి వినతి ఇచ్చా మన్నారు. స్పందించిన ఆయన తహశీల్దారు, ఇరిగేషన్ అధికారులు లేఖరాసి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు.

తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులకు శిక్షణ

ప్రజాశక్తి- రామచంద్రాపురం (తిరుపతి రూరల్): గ్రామ పంచాయతీలలో ఉప సర్పంచ్లు, వార్డ్ సభ్యులు వారి గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన విధులు, బాధ్యతలు తెలుసుకున్నప్పుడే గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడపవచ్చని ఎంపిడివో కె రామచంద్ర అన్నారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని 34గ్రామ పంచాయతీలలోని ఉప సర్పంచ్లకు, ఇద్దరు వార్డు సభ్యులకు గ్రామ పంచాయతీ వ్యవహారాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా తరగతులలో పంచాయతీ పాలన, ఆదాయ వనరులు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ, మంచినీరు, గ్రామ సభలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వేముల యశోద, ఎంపీడీవో కె రామచంద్ర, ఈఓపీఆర్డీ ఆర్ మాధురి, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు హాజరయ్యారు.

ఘనంగా 'పల్లె పండుగ'

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పలు పంచాయతీల్లో పల్లో పండుగను ఘనంగా నిర్వహించారు.. మండల టిడిపి అధ్యక్షుడు సుధాకర్నాయుడు ఆధ్వర్యంలో పుత్తేరి, పీవీ కండ్రిగ, ఆలత్తూరు, పార్లపల్లి, కాటూరు, పళ్లమాల పంచాయతీలలో సిమెంట్ రోడ్లు నిర్మాణం, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో త్రివిక్రమరావు, మండల ఎన్ఆర్ఈజీఎస్ అధికారిణి, మండల ఏపీవో భాను ప్రియ, అగ్రికల్చర్ అధికారిణి భారతి, నాయకులు కన్నయ్య నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: నాగలాపురం పంచాయతీలో పల్లె పండుగలో భాగంగా టిడిపి మండల అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ పర్యవేక్షణలో సిసి రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ నాగలాపురం పంచాయతీలోని 13 పనులకు 49 లక్షల 75 వేల రూపాయల అంచనా వ్యయంతో, సిసి రోడ్లు, డ్రైనేజీలను పనులను చేపట్టామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన పంచాయతీ వ్యవస్థ పటిష్టతకు పల్లె పండుగ వారోత్సవాలు ద్వారా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్థిబన్, పరుశురాం శిల్పి, ఆటో బాలాజీ, లీలా రాజశేఖర్ యాదవ్, ఎండి క ం వ రా ర్ , డాక్టర్ శేషాద్రి, త్యానారాయణ పాల్గొన్నారు.

'క్యాన్సర్ను ఆదిలోనే తరిమికొడదాం'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రాణాంతక క్యాన్సర్ మహమ్మారిని ఆదిలోనే తరిమికొట్టాలని రాస్ పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు పిలుపునిచ్చారు. రాస్, టాటా ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ సంయుక్తంగా పట్టణంలోని బహుదూరుపేట నల్లగంగమ్మ గుడి ఆవరణలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ మనిషి యాంత్రిక జీవితానికి అలవాటు పడటం వల్ల రోగాలపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడని అన్నారు. వ్యాధి ముదిరితే తప్ప హాస్పిటల్ వైపు చూడటం లేదని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ మహమ్మారి గుండె జబ్బుల తర్వాత అత్యధికంగా ఇబ్బంది పెడుతున్న జబ్బు అనీ, ఆదిలోనే గుర్తించకపోతే ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందని వివరించారు. అనంతరం రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి అండ్ సి, నోటి క్యాన్సర్ ,రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య, రెడ్డి కుమారి, మెహతాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది ముఖేష్ కుమార్ ,రాజేశ్వరి, జ్యోత్స్న పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE Ist Addl. DIST JUDGE, KADAPA
M.V.O.P.No. 256/2023

Kalva Bhagyamma & 3 Others.
...Petitioners

Vs

M.Reddy Siddeswara, S/o Venkateswarlu, Aged about 30 years, Hindu, Driver of the Car, R/o D.No.19-3-A5/C6, Postal Colony, Tirupati Urban, Balaji District.
...Respondent No.3

NOTICE

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా వాది యొక్క తమ్ముడు, పై ప్రతివాది యొక్క కారు ఆక్సిడెంటులో చనిపోయినందునలకు గాను, వాదులు పై ప్రతివాది పైన దాఖలు చేసిన పిటిషను వాయిదా 15.11.2024వ తేదీన వున్నది. కావున పై ప్రతివాది 15.11.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు వకీలు ద్వారా గాని, లేక ఖుద్దున గాని పై కోర్టు నందు హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

యం.రామాంజనేయరెడ్డి
అడ్వకేట్, కడప.